క్లుప్తంగా

పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని మద్రిపల్లి దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త గోవిందస్వామి (57) శనివారం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి వెళ్లి గోవిందస్వామి మృతదేహంపై పూలమాల ఉంచి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట మండల కన్వీనర్ మణి, స్థానిక సర్పంచ్ ఉమామహేశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, నాయకులు జనార్దన్, ఉమాపతి, కుప్పయ్య, బాబు, ఆనందయ్య, నెలవాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

తిరుచానూరు: పద్మావతీఅమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు అమ్మవారు పుష్ప పల్లకీలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, వీజీఓ బాలిరెడ్డి, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ మధు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాష్, ఆలయ అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తుడికి భక్తవత్సలుని సారె

శ్రీకాళహస్తి: పట్టణంలోని తేరువీధిలో ఉన్న శ్రీభక్తకన్నప్ప ఆలయ 44వ వార్షికోత్సవం, ఉగాదిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరపున సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తకన్నప్ప ఆలయంలో అందజేశారు. అనంతరం కన్నప్ప ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీరంగరాజపురం: పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప కథనం మేరకు.. దిగువమిది కుప్పం గ్రామం సమీపంలో ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న మహాలింగం, చిరంజీవి, ఆనంద య్య, జయపాల్, అరుణ్, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేడుకగా ఉగాది ఆస్థానం



ఉగాది ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఆస్థానం వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు సర్కారు అభిషేకం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం శుద్ధి, తోమాల తదితర కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు ఆస్థాన మండపంలో పెద్దశేష వాహనంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించారు. టీటీడీ తరపున ఆలయ అధికారులు సమర్పించిన పట్టు వస్త్రాలను అర్చకులు ఉత్సవమూర్తులకు సమర్పించారు. ఆస్థానం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం వేదపండితులు ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి అక్షింతలను అందజేశారు. ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నగరి: విశేషాలంకరణలో కోదండరామస్వామి, కరియమాణిక్య స్వామి ఆలయంలో పంచాగం పఠనం చేస్తున్న ప్రసాద్‌శర్మ





నింద్రలోని ఓంశక్తి ఆలయంలో అన్నదానం



తెలుగు పండుగ.. ఊరూర వేడుక

నగరి డివిజన్‌లో ఉగాది సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలుగుదనం ఉట్టిపడేలా వేడుకలు జరుపుకున్నారు. పెద్దలు.. పిల్లలు.. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ఆలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు. ఉదయాన్నే ఉగాది పచ్చడి తిని షడ్రుచులను ఆస్వాదించారు. సాయంత్రం ఆలయాల్లో పంచాగ శ్రవణం చేసి, తమ సంవత్సరమంతా శుభం చేకూరాలని కోరుకున్నారు.

- వైభవంగా వేడుకలు

పుత్తూరు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని కొత్త దుస్తులు ధరించి, ఆలయాల సందర్శనకు వెళ్లారు. దీంతో పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి గీతా మందిరానికి ద్రౌపదీదేవిని మేళతాళాల నడుమ ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపు ముందు భక్తులు పాల కలశాలతో గీతా మందిరానికి చేరుకున్నారు. చౌటూరు వాస్తవ్యులు వెంకటేశులు, లక్ష్మీసుధ దంపతుల ఆధ్వర్యంలో గీతా మందిరంలో శ్రీకృష్ణుడికి భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం కనుల పండువగా చేశారు. అనంతరం శ్రీకృష్ణ స్వామిని పట్టు పీతాంబరాలు, విశేష సర్ణాభరణాలు, సుగంధ భరిత పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ద్రౌపదీదేవి ఆలయంలో ఈశ్వరాపురం వాస్తవ్యులు ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గీతా మందిరంలో గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. పట్టణంలోని ఈశ్వరాలయం, ఆంజనేయస్వామి, ఆరేటమ్మ, వల్లి దేవయాని సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పుత్తూరు: శ్రీకృష్ణుడికి పాలాభిషేకం

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం

పుత్తూరు గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం శ్రీక్రోధి నామ ఉగాది సంవత్సరాదిని పురస్కరించుకుని అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన ఆర్ముగం, చాముండేశ్వరి దంపతులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఆలయాల్లో ఉగాది పూజలు

నగరి : మున్సిపాలిటీ, మండలంలోని ఆలయాల్లో మంగళవారం ఉగాది పూజలు వైభవంగా జరిగాయి. కరియమాణిక్యస్వామి ఆలయంలో శ్రీక్రోధి నామ ఉగాదిని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. పురోహితులు ప్రసాద్‌శర్మ పంచాంగ పఠనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పంచాంగ శ్రవణం చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాధికారి వెంకటరమణ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీలోని టీఆర్ కండ్రిగలో దేశమ్మ దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీప్రసన్న వీరాంజనేయస్వామి, కరకంటేశ్వర స్వామి, కోదండరామాలయం, రామాలయంలో స్వామివార్లకు విశేషాలంకరణలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

ఓం శక్తి ఆలయంలో...

నింద్ర: మండల కేంద్రంలోని ఓంశక్తి ఆలయంలో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. స్థానికులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పంచాగం పఠనం చేశారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : మండలంలోని అన్ని ఆలయాల్లో తెలుగు సంత్సరాది ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆరిమాను గ్రామంలోని ఆరిమాను గంగమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంచిపెట్టారు. ఆలయ ఆవరణలో వెంకటచార్యుల ఆధ్వర్యంలో శ్రీక్రోధి సంవత్సరం తెలుగు పంచాంగ పఠనం చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం : మండలంలోని అన్ని ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌కు పసుపు, చందనం, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివార్లకు పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాలంకరణ చేసి, పూజలు జరిపారు. భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడిని పంచి పెట్టారు. పలు ఆలయాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



పుత్తూరు: ద్రౌపదీదేవి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



శ్రీరంగరాజపురం: విశేషాలంకరణలో ఆరిమానుగంగమ్మ,



ఆలయంలో భక్తుల రద్దీ

ఉక్కపోత... ఉక్కిరిబిక్కిరి

- మండుతున్న ఎండలు
- మధ్యాహ్నం ఇళ్లకే పరిమితమవుతున్న జనం



ఖాళీగా ఉన్న జాతీయ రహదారి

నగరి : ఏప్రిల్ నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. 10 గంటలకే రోడ్లపైన రాకపోకలు తగ్గుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. వేడి తాళలేక జనం అల్లాడిపోతున్నారు. పగలు ఎండ, రాత్రి ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరి నియోజకవర్గంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటింది. దీంతో మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు కాలుపెట్టాలంటే జంకుతున్నారు. ద్విచక్రవాహన చోదకులు ముఖం కప్పుకునేలా దుస్తులు కట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వేసవి తాపం తీర్చుకోవడానికి జనం పుచ్చకాయలు, దోసకాయలు కొనుగోలు చేసి, తింటున్నారు. అలాగే లెమన్‌సోడా, నన్నారి, సర్బత్‌ల వ్యాపారం ఊపందుకుంది. ట్రాక్టర్‌లో కొబ్బరికాయలు తెచ్చి పలు కూడళ్ల వద్ద విక్రయిస్తుండగా వాటి కొనుగోలుకు జనం గుమిగూడుతున్నారు. పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. చావడి ప్రాంతంలో అయ్యప్ప భక్త సమాజం వారు ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మంగళవారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

వేసవిలో జనం జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవిరాజు తెలిపారు. ఎండల్లో వెళ్లాల్సివస్తే గొడుగు తీసుకెళ్లాలని సూచించారు. అవసరమైతే తలకు తువ్వాలు కట్టుకోవాలి లేదా టోపీ పెట్టుకోవాలన్నారు. వేసవిలో నూలు లేదా కాటన్ దుస్తులు ధరించాలన్నారు. వేసవిలో ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ కలిపిన నీరు తాగాలన్నారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె వంటివి తీసుకోవద్దని సూచించారు. శీతలపానీయాలు, మంచు ముక్కలు తీసుకోవద్దన్నారు. నిమ్మరసం గానీ, కొబ్బరినీరు గానీ, మంచినీరుగానీ తాగాలన్నారు.

తిరుచ్చిపై వేణుగోపాలుడి చిద్విలాసం



వేణుగోపాల స్వామివారికి స్నపన తిరుమంజనం చేస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారు మంగళవారం ఉగాది ఉత్సవాల్లో భాగంగా స్వామివారు తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులకు వేద పండితులు వేదం మంత్రాల నడుమ కనుల పండువగా స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం 4 గంటలకు వేదపడింతులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీ వేణుగోపాలస్వామి వారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిరువీధి ఉత్సవం అనంతరం ఆలయానికి వేంచేసిన స్వామివారికి రాత్రి 8.30 ఏకాంత సేవ నిర్వహించి స్వామివారిని పవళింపజేశారు. కార్యక్రమంలో టీటీటీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు నారాయణ దాశరథి, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు

ఘనంగా పూలంగి సేవ

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీనరసింహుడికి అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 9 గంటలకు శ్రీవారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహా స్వామి ఉత్సవ విగ్రహాన్ని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణతో కోన మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం, స్వామి అమ్మవార్ల కల్యాణం చేపట్టారు. నూతన సంవత్సరం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు కోనకు చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే రాపూరులోని రాపూరమ్మ, పర్వతవర్థిని రామనాథేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, మద్దెలమడుగులోని కృష్ణమందిరం, అయ్యప్పమహావిష్ణు ఆలయాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.



గరుడవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

ముస్లింల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ కృషి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ముస్లిం, మైనారిటీల అభ్యున్నతికి పెద్దపీట వేశారని జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ దంపతులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కృపాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ముస్లింలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక ముస్లింల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలిస్తే మరింత అభివృద్ధి చేయడానికి జగనన్న సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ఎప్పుడూ ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వాలను ఎవరూ చూసి ఉండరని తెలిపారు. ఈ ఐదేళ్లలో సీఎం జగనన్న ప్రతి సామాజికవర్గం అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో సంక్షేమ పథకాలు అందించారన్నారు. అదేవిధంగా జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దత్తతకు ఇచ్చి, కార్వేటినగరాన్ని తన తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి దత్తతకు తీసుకుని కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులను చేపట్టారని ఆమె గుర్తు చేశారు. తన తండ్రి చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, దాసరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుమతి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్, కోఆప్షన్‌మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మహిళా నాయకులు మోహనకుమారి, గిరిజ, అంబిక తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగాన్ని ఆదుకోండి

పుత్తూరు: మినీ ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజావేదిక జిల్లా కార్యదర్శి కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడ కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. చిన్న వాహనాలను నడుపుకుని జీవనం సాగించే కుటుంబాలకు అన్ని వస్తువుల ధరల పెరుగుదల గుదిబండగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మినీ రవాణా రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సమాచారం హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి ఆటో కార్మికులకు యూనిఫామ్ వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రజావేదిక జిల్లా నాయకులు మునేంద్ర, చంద్రబాబు, మినీ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు పొన్ను రంగం, హరీష్, ధనపాల్, రఘుపతినాయుడు, తిరుమలయ్య, అంకయ్య, బాబు, రామ్మూర్తి, రమేష్, కాశింభాయ్ తదితరులు పాల్గొన్నారు.



యూనిఫామ్ అందుకున్న ఆటో కార్మికులతో సంఘం నాయకులు

జగనన్న పాలనలోనే మహిళా సంక్షేమం

కార్వేటినగరం: రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు కొనసాగించాలంటే అది ఒక్క జగనన్నతోనే సాధ్యమని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం కార్వేటినగరం పెద్దదళితవాడలో ప్రభుత్వం రూ.38 లక్షలతో నిర్మించిన నూతన కమ్యూనిటీ భవనంలో డ్వాక్రా సంఘం మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాలంటే మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బూటకపు మాటలతో మోసపూరిత వాగ్దానాలతో ఎన్నికల సమయంలో టీడీపీ పగటి వేషగాళ్లు వస్తున్నారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో లక్షల రూపాయల లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. టీడీపీకి ఓటు వేస్తే అవినీతికి, అక్రమాలకు చోటిచ్చినట్లేనని, సంక్షేమ పథకాలన్నీ అందవన్నారు. గత ప్రభుత్వాలు దళితవాడలను పట్టించుకున్న పాపాన పోలేదని, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్వేటినగరం అభివృద్ధికి లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులతో పాటు రూ.38 లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మించి గ్రామస్తులు కలలను నెరవేర్చిన ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పసుపు–కుంకుమ పేరిట మహిళలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరుతో అందించడమే కాకుండా, డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వందశాతం రుణ మాఫీ చేసి అక్కచెల్లెమ్మలకు తోబుట్టువుగా నిలిచిన జగనన్నను 2024 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసి మరిన్ని సంక్షేమ పథకాలను అందుకోవడానికి మనం సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, డ్వాక్రా మహిళలు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత